క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల నిమిత్తం 19వ తేదీ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండిలోని మెయిన్ సెంటర్, పెద్ద వంతెన ఏరియా, రాజులపేట, సంతమార్కెట్, తహసీల్దార్ కార్యాలయం ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్

నరసాపురం: డైవర్షన్ పాలిటిక్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబును మించిన వారు లేరని మరోసారి ఆయనే రుజువు చేసుకున్నారని వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాస్టర్ల గౌరవ వేతనం కోసం కూటమి సర్కార్ రూ.30 కోట్లు మంజూరుచేయడం వెనుక, పాస్టర్ ప్రవీణ్ పగడాల వ్యవహారం క్రిస్టియన్ సోదరులు మరిచిపోవడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. ప్రవీణ్ పగడాల మృతి వ్యవహారంలో ఇంకా పూర్తి నిజానిజాలు బయటకు రాలేదన్నారు. ప్రభుత్వంపై క్రిస్టియన్ మైనార్టీలు గుర్రుగా ఉన్న నేపథ్యంలో అకస్మాత్తుగా వారు గుర్తొచ్చి రూ.30 కోట్లు ప్రకటించారని పేర్కొన్నారు. రంజాన్ వెళ్లిపోయినా ముస్లింల సంక్షేమం గుర్తు రాలేదని ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టిన 8నెలలు అవుతున్నా పూజారుల గౌరవవేతనం ఊసే లేదని విమర్శించారు. రాష్ట్రంలో క్రిస్టియన్ సోదరులు అన్ని విషయాలు గమనిస్తున్నారని వివరించారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీఓలు శ్రీకర్, అఖిలలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు ఇద్దరు అధికారులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



మునమర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెనుగొండ: మార్చి నెల నుంచి చెల్లించాల్సిన ఉపాధి పని వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుగొండ మండలం మునమర్రులో ఉపాధి కూలీలతో కలసి ధర్నా నిర్వహించారు. పని ప్రాంతాల్లో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లల్లో గాజు పెంకులు గుచ్చుకొని బాధపడుతున్న కార్మికులకు ప్రథమ చికిత్స చెయించి, వైద్యం ప్రభుత్వమే చేయించాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని ఈ నెల 22న జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని కార్మికులతో కలసి ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొరు జగన్నాథం, సీఐటీయూ నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పాలకొల్లు సెంట్రల్: విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న 7, 9వ తరగతి విద్యార్థులకు జరిగిన ప్రతిభా పాటవ పరీక్షలు, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం స్థానిక ఎంఎంకెఎస్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ క్రియా సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతిభా పాటవ పరీక్షల వల్ల విద్యార్థుల్లో ఉన్న స్కిల్స్ బయటపడతాయని అన్నారు. ఐదో తరగతిలో నవోదయ, ఎనిమిదో తరగతిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష, అలాగే పాలిటెక్నిక్ పరీక్షలు విద్యార్థులందరూ రాయాలని సూచించారు. ఇలా టెస్టులు రాయడం వల్ల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. అలాగే తమ సంస్థ పెద్దాపురంలో ఉందని ఆ సంస్థను సందర్శిస్తే విద్యార్థులు సొంతంగా ప్రయోగాలు చేసుకోవడం చూపుతామని వివరించారు. సమాఖ్య అధ్యక్షుడు మెరుగు శ్రీనుబాబు మాట్లాడుతూ విజేతలకు రూ.60 వేల విలువైన బహుమతులు అందజేశామన్నారు. ఏడో తరగతిలో 18 మంది, 9వ తరగతిలో 14 మంది వ్యాసరచన పోటీల్లో ముగ్గురు విజేతలకు ఈ నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు, పితాని ధర్మారావు, సంస్థ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, ఉపాధ్యాయులు మంచెం కనకరాజు, చేగొండి కరుణ కుమార్, కింజరాపు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూసారానికి నవధాన్యాల సాగు

- పెరుగుతున్న జీవ వైవిధ్యం
- నశించిన సూక్ష్మజీవుల అభివృద్ధి
- దాళ్వా మాసూళ్లలో విత్తనాలు చల్లితే మరింత మేలు



కుప్పనపూడిలో దాళ్వా మాసూళ్లకు ముందు నవధాన్యాలు చల్లుతున్న రైతు



నవధాన్యాలు

ఆకివీడు: భూమికి, రైతులకు మేలు చేసే నవధాన్యాల సాగు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి భూసారాన్ని కోల్పోతూ వరి సాగు చేస్తున్నారు. ఒక పక్క రొయ్యల చెరువుల్లోని సెలనిటీ నీరు, మరో పక్క రసాయినక మందులు, ఎరువుల వినియోగంతో భూసారం కోల్పోతుంది. భూమిలో ఉండాల్సిన పోషకాలు నశించి పోతున్నాయి. దీంతో జింక్, నత్రజని వంటి ఇతర ఖనిజాల లోపాలు తలెత్తుతున్నాయి. వాటి కోసం మళ్లీ కృత్రిమంగా తయారు చేసిన మందులు వినియోగించాల్సి వస్తుంది.

భూసారానికి చిరు ప్రయత్నం

సారవంతమైన భూమిని సృష్టించుకునేందుకు చిరు ప్రయత్నంగా రైతులు పొలాల్లో నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. గోధుమలు, వడ్ల, కందులు, శనగలు, పెసలు, శనగలు, బొబ్బర్లు, నువ్వులు, మినుములు, ఉలవల గింజలను నవ ధాన్యాలుగా పిలుస్తారు. నవధాన్యాల గింజలు మొలకలెత్తి పెరగడం వలన వాటిలోని పోషకాలు భూమిలోకి చేరుతాయి. చేలు దమ్ము సమయంలో ఈ మొక్కలను కలిపి దున్ని వేయడం ద్వారా భూమిలో ఎరువు ఏర్పడుతుంది. సేంద్రియ కర్బన శాతం పెరుగుతోంది. నీటి నిలువ ద్వారా సామర్థ్యం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గుతుంది.

జీవ వైవిధ్యం పెరుగుతుంది

నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు ద్వారా భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతోంది. సూక్ష్మజీవుల శాతం పెరుగుతుంది. పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయి. వర్మీ కంపోస్టుకు అవకాశం ఏర్పడి భూమిలో ఏలిక పాములు, నత్తలు వృద్ధి చెందుతాయి. చీడపీడలు దూరంగా ఉంటాయి. భూమిలో కాలుష్యం తగ్గి, చౌడు బారడం తగ్గుతోంది. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీంతో పంటల్లో అధిక దిగుబడులు సాధించొచ్చు. రైతులకు పెట్టుబడుల వ్యయం భారీగా తగ్గుతుంది.

భూసారం మెరుగవుతుంది



నవ ధాన్యాల సాగు రైతులకు మేలు చేస్తుంది. భూసారం పెరుగుతుంది. చీడపీడలకు పంటలు దూరంగా ఉంటాయి. కోతలకు ముందే చేలల్లో విత్తనాలను చల్లుకోవడం మంచిది. దమ్ములో నవధాన్యాల మొక్కలను కలిపి దమ్ము చేయాలి. డెల్టా ప్రాంతంలో నీటి ఇబ్బందుల దృష్ట్యా భూములు చౌడు బారకుండా ఉండేందుకు పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు మంచిది.

–ఎంఆర్‌పీ ప్రియాంక, ఏవో, ఆకివీడు మండలం

సారవంతమైన భూమి లేదు



పంట భూములు నిస్సారంగా మారిపోతున్నాయి. రొయ్యల చెరువుల నీరు పంట కాలువల్లోకి చొచ్చుకు రావడంతో సారం నశించిపోతుంది. వీటికి తోడు ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగింది. భూసారాన్ని పెంపొందించేందుకు నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు ఆవశ్యకత ఎంతైనా ఉంది. రైతులు వీటిని సాగు చేసి భూసారాన్ని పెంచేందుకు ప్రభుత్వం నవధాన్యాలను ఉచితంగా అందజేయాలి.

–నంద్యాల వెంకన్న, రైతు, కుప్పనపూడి, ఆకివీడు మండలం

సమస్త మానవాళికి జీవం సువార్త

- భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- క్రైస్తవులతో కిక్కిరిసిన చర్చిలు.. ప్రత్యేక ప్రార్థనలు
- పలుచోట్ల ర్యాలీలు, పాస్టర్ల బోధనలు



కాళ్ల: వేంపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

ఉండి: సమస్త మానవాళికి క్రీస్తు సువార్త జీవం అని పేరిష్ పాస్టర్ మానుకొండ ప్రసన్నకుమార్ అన్నారు. నలభై రోజుల ఉపవాస ప్రార్థనల్లో భాగంగా నిర్వహించే గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల వ్యాప్తంగా చర్చిలు క్రైస్తవులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు సిలువపై మరణానికి ముందుగా పలుకిన ఏడు మాటలను క్రైస్తవ బోధకులు, ప్రత్యేక ప్రసంగీకులు, పాస్టర్లు వివరించారు. ఈ సందర్భంగా ఉండి పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పేరిష్ పాస్టర్ మానుకొండ ప్రసన్నకుమార్, తాడి రాజు, గాతల సామ్యూల్‌రాజు వాక్య సందేశాన్ని అందించారు. యండగండి ఇమ్మానుయేలు లూథరన్ చర్చిలో సిస్టర్ గోగులమండ అనూహ్య గుడ్ ఫ్రైడే వాక్య సందేశం అందించారు. ఆయా కార్యక్రమాల్లో రెవరెండ్ వి.నెహ్రూ, గోగులమండ అనూహ్య, తాడి రాజు, గాతల సామ్యూల్, మానుకొండ శాంతకుమారి, చికిలే శాంతకుమారి, శాంతిబాయి, తాడేపల్లి శాంతి, మానుకొండ చిట్టిమరియ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఆకివీడు: ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజును ప్రపంచమంతా ఆయనను తలుస్తూ గుడ్ ఫ్రైడేను చేసుకుంటారని రెవరెండ్ పాస్టర్ గోడి జోసఫ్ రాజు చెప్పారు స్థానిక పెద్ద పేటలోని సీబీసీఎంసీ ఆంధ్ర సెంట్రల్ బాప్టిస్ట్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక రూపాంతర దేవాలయం ఆధ్వర్యంలో సిలువ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్ నుంచి అజ్జమూరు గరువు వద్ద చర్చి వరకు ప్రార్థన నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల్లో మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు సిలువ త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

కాళ్ల: ప్రపంచ మానవాళి పాప పరిహారార్థం ఏసుక్రీస్తు చేసిన సిలువ త్యాగాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ముఖ్యంగా శుక్రవారం ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ఆయా సంఘాల పాస్టర్లు, విశ్వాసులు వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని లూథరన్, ఆర్‌సీఎం, మన్నా, పలు డినామినేషన్లకు చెందిన చర్చిల్లో గుడ్ ఫ్రైడే ధ్యాన ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ప్రేమకు, త్యాగానికి, ప్రతిరూపం క్రైస్తవ్యం

పాలకోడేరు: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శృంగవృక్షం గ్రామంలో విచారణ ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు ఫాదర్ తోట గాబ్రియల్ ఆధ్వర్యంలో హైస్కూల్ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసుక్రీస్తు వేషధారణలో యువకులు, పిల్లలు చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ మాట్లాడుతూ త్యాగానికి, ప్రేమకు, క్షమాగుణానికి ప్రతీక క్రైస్తవ్యమన్నారు. ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగం సూరిబాబు, వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్ పలు క్రైస్తవ సంఘ కాపరులు, సంఘ విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు, యనమదుర్రు, వెంప, చినఅమిరం, రాయలం, అనాకోడేరు, కొమరాడ, వెంప, తాడేరు, బేతపూడి, తుందుర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి తదితర గ్రామాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు లోక రక్షణకై ఏసు క్రీస్తు రాకడను గురించి వివరించారు. అనంతరం క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక గీతాలపనలు చేశారు.

బేతనీ చర్చిలో..

భీమవరం: మానవుల కోసం ఏసుక్రీస్తు సిలువ వేయబడ్డారని బేతని చర్చ్ పాస్టర్ ఎస్.డానియేల్ పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం బేతని చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలపై పలువురు మాట్లాడారు. బేతని యూత్ వారు ప్రత్యేక క్రైస్తవ పాటలు ఆలపించారు. కార్యక్రమంలో డి.వర్గీస్ డానియేల్, గంటా సుందర్‌కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



ఉండి: లూథరన్ చర్చిలో సందేశాన్ని అందిస్తున్న పాస్టర్ ప్రసన్నకుమార్



ఆకివీడు: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాలకోడేరు: సిలువను మోస్తున్న విచారణ కర్త ఫాదర్ గాబ్రియల్



ఉండి: యండగండిలో గుడ్ ఫ్రైడే సందేశాన్నిస్తున్న సిస్టర్ గోగులమండ అనూహ్య



భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు



భీమవరం: బేతని చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంప గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనుల చేస్తున్న కూలీలను సీఐటీయూ నాయకులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్నప్పటికీ నగదు వారి ఖాతాల్లో జమ కాలేదన్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. చట్ట ప్రకారం 15 రోజులకోసారి వేతనం జమ కావాల్సి ఉండగా రెండు నెలలు గడుస్తున్నా కూలీ సొమ్ము జమ కాలేదన్నారు. ఉపాధి పనుల వద్ద సమ్మర్ టెంట్‌లు, మంచినీటి సౌకర్యం, వైద్య సదుపాయం కల్పించాలన్నారు. అలాగే మొగల్తూరు మండలంలోని నల్లవారితోట ఉపాధి హామీ కార్మికులపై వ్యాన్ దూసుకెళ్లి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కార్మికులు భూపతి సామ్యేయేలు, వేంద్ర వెంకటలక్ష్మి, అమ్మాజీ, మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌పై అక్రమ కట్టడం



షెడ్డు కింద ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని మంచినీటి చెరువుకు వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి నేరుగా నీరు వచ్చే పైప్‌లైన్‌పై నిర్మించిన అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత నాలుగు రోజుల క్రితం పైప్‌లైన్ పగిలిపోయి నీరు కారడంతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. చివరకు అక్రమ కట్టడం క్రింద పైప్ పగిలినట్లు గుర్తించారు. దీంతో మరమ్మతులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, ఆలకోడు కాలువ గట్టు ఆక్రమించి అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పాడైపోతుందని స్థానికులు వాపోతున్నారు. మరమ్మతులు చేయడానికి షెడ్డు పునాదుల క్రింద పైప్‌లైన్ ఉండటంతో పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణదారుడు అడ్డెకు ఇవ్వడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇటువంటి ఆక్రమణలను తక్షణం తొలగించి, పైప్‌లైన్‌ను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు అవగాహన ర్యాలీ

నరసాపురం: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ నరసాపురం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు బస్టాండ్ సెంటర్ నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆచంటలో

పెనుగొండ: ఆచంటలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూర్ణబాబ్జీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆచంట ఎస్‌బీఐ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ జరుగుతుందని, ర్యాలీలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళాలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా ప్రతిమాంబసమేత సదాశివ స్వామి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందజేశారు. శుక్రవారం అలంపురం టీబీఆర్ సంస్థల అధినేత బోగేశ్వరరావు తన వంతు విరాళం రూ.1లక్షలను, దేవీశ్రీ ట్రేడర్స్ రూ. 1 లక్ష, గూడెంకు చెందిన ప్రముఖ వాణిజ్యవేత్త నంద్యాల కృష్ణమూర్తి రూ. 75 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్ల కృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు జవ్వాది శేషగిరి, వీర్ల ధనరాజు, కామిశెట్టి ధనరాజు, ఆరాధ్యుల అంజి, తూము చిన్న, కడకట్ల శ్రీను పాల్గొన్నారు.

కాన్‌ప్లెక్స్ దృశ్యాలు ఆస్వాదించొచ్చు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఏర్పాటు చేసిన కాన్‌ప్లెక్సు శ్రీశ్రీ స్క్రీన్స్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అధునాతన సాంకేతిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ స్క్రీన్స్‌పై ఇక కావాల్సిన చిత్రాలను ఆస్వాదించవచ్చని వక్తలు పేర్కొన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ టీడీపీ నాయకులు ఈతకోట తాతాజీ, వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా సకల సౌకర్యాలు ఇక్కడ అందుతాయని నిర్వాహకులు శ్రీశ్రీ శ్రీనివాసు, ఎస్.వి.రమణ, చలంచర్ల హరిప్రసాద్‌లు తెలిపారు. ప్రముఖ చిత్ర పంపిణీ దారు ఉషా బాలకృష్ణ అన్ని పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యంతో ప్రమాదాల నివారణ



ఆకివీడు: కరపత్రం ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



భీమవరం: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

ఆకివీడు: ప్రజల్లో చైతన్యం కలిగించడం ద్వారానే అగ్ని ప్రమాదాలు చాలా వరకూ తగ్గాయని, భవిష్యత్‌లో మరింత అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఎస్సై హనుమంతు నాగరాజు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరపత్రాలు, గోడ పత్రికలను అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అగ్ని మాపక వారోత్సవాలు

భీమవరం: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా భీమవరం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అగ్నిమాపక వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. భీమవరం పరిధిలోని పలు ఫ్యాక్టరీల సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఏ విధంగా స్పందించాలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు,సిబ్బంది పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి

అత్తిలి: ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ తెలిపారు. ఈ ధర్నాలో కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.శుక్రవారం అత్తిలి మండలం దంతుపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను వారు కలిసి ఉపాధి హామీలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సత్యనారాయణ, గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ఉపాధిహామీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కూలీలందరూ ఐక్యంగా ఉపాధి హామీ పరిరక్షణకు సిద్ధం కావాలని అన్నారు. బళ్ల చినవీరభద్రరావు, వనం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

తణుకు అర్బన్: తణుకు పట్టణంలోని పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, దాతల సహకారం ఎంతో అవసరముందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. శుక్రవారం తణుకు పురపాలక సంఘ కార్యాలయంలో పీ–4 లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలు, దాత లు పట్టణంలోని పార్కులు, బస్‌షెల్టర్స్, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే అరిమిల్లి రాధకృష్ణ, ఆంధ్ర షుగర్స్ జీఎం ఎ.సాంబశివరావు, అక్కమాంబ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఎన్‌కే మొహిద్దీన్, కే.రామకృష్ణ, వి.శ్రీనివాస్, జి.రాజేష్, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.